# అధ్యాపకులకు ఆదర్శప్రాయుడు

**బాలగోపాల్** జీవితం కేవలం సామాజిక శాస్త్రవేత్తలకే ఆదర్శంకాదు, విద్యార్థులకు, యువకులకు కూడా ఆయన ఆదర్శం. కావలిలో చదువుకున్న బాలగోపాల్ ఒక పరిశోధక విద్యార్థిగా ఆర్ఇసికి వచ్చారు.ఆ తర్వాత కాకతీయ యూనివర్సిటీలో గణితశాస్త్ర అధ్యాపకుడుగా పనిచేసారు. కొంత మంది విద్యార్థులు పుస్తకాల వరకే పరిమితంగా ఉంటారు. వారి సహచర్యం కూడా క్లాస్‌మేట్‌ల వరకే పరిమితంగా ఉంటుంది. మరి కొంతమంది కాలేజీ విద్యార్థులందరితో కలిసిపోతారు. అందరినీ ప్రభావితం చేస్తారు. మరికొందరైతే ఇతరుల జీవితాల్లోకి చొచ్చుకుపోతారు. కొందరు విద్యార్థులు కాలేజీల రూపురేఖలే మార్చివేస్తారు. ఇంకా కొద్ది మందైతే ఆ పరిసరాల ప్రజల జీవితాలతో కూడా చొచ్చుకొని పోతారు. ఇంకా కొంతమంది, ఆ ప్రాంత మట్టిన తన ఒంటినిండా రాసుకుంటారు. ఆ మట్టిలోని చైతన్యాన్ని ఆస్వాదిస్తారు. ఆ మట్టి చేసే పోరాటాల వెంట అడుగులు వేసుకుంటూ వెళతారు. కొందరు ఆ నేల విముక్తి కోసం తమ జీవితాలనే అంకితం చేస్తారు. ఇలాంటి అరుదైన జీవితాల కోవకు చెందిన మహామనిషి బాలగోపాల్.

విశ్వవిద్యాలయాన్ని కేవలం ఎలైటిస్టిక్ కల్చర్‌కు నిలయమైన కాలంలో వాటిని ప్రజాజీవితంతో మమేకం చేయించి పని చేశాడు. బోర్డు మీద చాక్‌పీస్‌తో గణితం చెప్పే పంతులు, రాత్రింబవళ్లు లెక్కలు చేసి సమీకరణాలు ఎలా చేసుకుంటాడో సమాజాన్ని పలకగా మార్చుకొని ప్రజల జీవితాలను లెక్కలుగా చేసుకున్నాడు.

లెక్కలంటే అంకెలు కావని సామాజిక శాస్త్రాన్ని అధ్యయనం చేసే కొత్త పద్ధతియని ప్రపంచానికి చూపించటమే గాక తను ఆచరించాడు. అంకెలు కేవలం సమీకరణాల సాధనమే కాదు. సామాజిక సమస్యలను విశ్లేషించుకోవటానికి, దానికి కారణాలు కనుక్కోవటమే నిజమైన గణితమన్నాడు. వాటిని విశ్లేషించి ఒక తత్త్వశాస్త్రవేత్తగా ఊరుకోకుండా, ప్రజల బతుకులను, హక్కుల సాధనను ఎంచుకొని కార్యోన్ముఖుడయ్యాడు. భుజం మీద సంచి వేసుకొని ఒక్కొక్క వూరు తిరిగి ఆ ప్రజల జీవితంతో మమేకమయ్యాడు. జనం తినే కారముద్దలే తిన్నాడు. గిరిజనుల జొన్నరొట్టెలే తిన్నాడు. వారి కష్టాలకు పరిష్కార మార్గం చూపించటమే కాదు తానొక కార్యకర్తగా మారాడు. పుస్తకాల వరకే పరిమితమైతే ఆయన మేధావిత్వానికి జేజేలు కొడతారు. కానీ ప్రజల కోసం కార్యోన్ముఖుడైతే మాత్రం ఆ మేధావిని పాలకులు, ఆధిపత్యవాదులు సహించరు. శత్రువుగానే పరిగణిస్తారు. అందుకే ఆయనను పోలీసులు అనేకసార్లు కిడ్నాప్ చేసారు. అరెస్టులు చేశారు. ఎన్నో హింసలకు గురిచేశారు. చావుకు దరిదాపులోకి వెళ్ళాడు. కానీ ఆ ప్రతి దెబ్బ అతని పట్టుదలకు పదును పెట్టింది. ఆ పట్టుదల అతనిలో పెరుగుతున్నా కొద్ది ఎదుగుతూ వచ్చాడు. కేవలం ఇలాంటి అన్యాయాలు తెలంగాణాలోనే కాదు ఆసేతు భారతదేశంలో ఎక్కడ జరిగినా కానీ అక్కడకు వెళ్లి అదే పని చేశాడు. అతను ఎదుగుతున్నా కొద్ది ప్రపంచంలోని పీడిత ప్రజానీకమంతా ఆయనకు ఒకే రకంగా కనపడింది. ఇరాక్ ప్రజలైనా, కాశ్మీర్, తెలంగాణ ప్రజలైనా ఆయనకు ఒకటే. వీరంతా పీడిత ప్రజానీకమే అనుకున్నాడు. దేశ సరిహద్దుల సమస్యలకు రాజకీయ నాయకుల కీచులాటలే కారణమన్నాడు. అతను పెరుగుతున్నా కొద్ది మానవతామూర్తిగా ఉద్భవించాడు. మనిషికి జీవించే హక్కుందని, అది ఒకరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండదన్నాడు. అది పుట్టుకతోనే వచ్చిన హక్కు అని ఎలిగెత్తి చాటాడు. టెక్నాలజీ పెరుగుతున్నా కొద్దీ మానవ జీవితానికే ప్రమాదం వస్తున్న కాలంలో మానవహక్కుల ఉద్యమానికి కొత్త భాష్యం చెప్పాడు. అభివృద్ధియనే పేరుమీద మనిషి జీవించే హక్కును హరించటం అవరోధం అని కంకణదారుడయ్యాడు. వచ్చే కాలాల్లో మానవ హక్కులు కేవలం ప్రభుత్వాలతోనే కాదు పెట్టుబడీదారి సమాజంలో ఇమిడి ఉన్న లక్షణమని, దానికి వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరముందని చెబుతూ తుది శ్వాస విడిచాడు. మానవ హక్కుల ఉద్యమానికి కొత్త కోణాన్ని ఇచ్చాడు. దానికి సమిధ అయ్యాడు. ఆ ఉద్యమం ఇప్పుడు రగులుకుంది. సమాజం మహాయోధుడ్ని పోగొట్టుకుంది. కానీ ఎంతో

మంది పోరాట యోధుల్ని ఆ ఉద్యమం తయారు చేస్తుంది. ఒక ఉద్యమానికి నాంది పలికాడు. ఒక విద్యార్థిగా కాకతీయ కొచ్చాడు. ఒక ఉద్యమ నేతగా అరుణతారగా ఆకాశానికెక్కాడు.

ఒకనాడు ఈ తెలంగాణ పోరుగడ్డ ప్రపంచానికే కొత్త సందేశమిచ్చిన క్షేత్రం. సాంకేతిక యుగంలో ఒక కొత్త ఉద్యమానికి బాలగోపాల్ హక్కుల ఉద్యమ విత్తనాలు ఈ నేలపై చల్లాడు. ఆ మొలకలను పెంచి పోషించవలసిన బాధ్యత మనముందు పెట్టాడు. ఇది మన ముందున్న సవాల్.

విశ్వవిద్యాలయాలను నక్సలైట్ ప్రభావిత ప్రాంతాలలో పెట్టవద్దని వాదన చేసే పెద్దలు అనేకమంది ఉన్నారు. ఉన్నత విద్యాలయాలు కూడా తమ పెరళ్ళలోనే ఉండాలని, తమ తుపాకుల పహారాలోనే విద్యాలయాలు పెట్టాలంటున్నవారు లేకపోలేదు. వారి కోటల్లోనే, వారి కను చూపులోనే అన్ని బడులు, కళాశాలలు పని చేయాలంటారు. ఒక ఆర్ఇసిని వరంగల్‌లో పెట్టి తప్పు చేశామని ఇప్పటికీ కొందరంటున్నారు. దేశంలో 18 ఆర్ఇసిలున్నాయి. 9 ఐఐటిలున్నాయి. 530 విశ్వవిద్యాలయున్నాయి. మహా విద్యాలయాలు వేల సంఖ్యలో ఉన్నాయి. ఏ విద్యాలయానికి లేని చరిత్ర ఈ వరంగల్ ఆర్ఇసికి ఎలా వచ్చింది? విశ్వవిద్యాలయం అంటే బిల్డింగ్‌లు, గోడలు, పరికరాలే కాదు. అది ఏ క్షేత్రంలో ఉంది? ఆ విద్యాసంస్థల, విద్యార్థుల అంకిత స్వభావమేమిటి? అన్నది ముఖ్యం.

పరిశోధకులు ఏ ప్రజల కన్నీళ్లు తుడిచేందుకు సిద్ధమవుతున్నారు. అదే ఆ విద్యాలయం ఇచ్చే జ్ఞానానికి గీటురాయి అవుతుంది. విద్యాలయాలు పెట్టేటప్పుడు పేద ప్రజానీకం మధ్య పెట్టండి. పీడిత ప్రజానీకం మధ్య పెట్టండి. బొగ్గుగనుల మధ్య, గిరిజన ఆదివాసి ప్రాంతాల మధ్య, పీడితుల మధ్య పెట్టండి. అపుడు విద్యార్థి పుస్తకాలతో సహా ప్రజల జీవితాలను కూడా చదువుతాడు. దాని నుంచి వచ్చే విద్యార్థులే బాలగోపాల్‌లు అవుతారు. ఈ అనుభవం ప్రపంచ చరిత్రను చూసిన వాళ్ళందరికీ కనిపిస్తుంది. రస్సెల్ జీవితాన్ని చదవండి, పాల్‌పెర్రి జీవితం చూడండి. హర్వర్డ్‌లో ఉన్న చామ్‌స్కీ జీవితాలను చూడండి. మన గడ్డలో పుట్టిన బాలగోపాల్‌ను చూదండి. ఇదే అధ్యాపక వర్గానికి ఆయన త జీవితాన్ని ఆచరణలో చూపి ఇస్తున్న సందేశం.

**– చుక్కా రామయ్య**

*ప్రముఖ విద్యావేత్త, శాసనమండలి సభ్యులు*

*11 అక్టోబరు, 2009, ఆంధ్రజ్యోతి దినపత్రిక*